సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం | 12 | ఆగస్టు | 2025



ఆవుల కుటుంబానికి పరామర్శ

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆవుల వేణు గోపాల్‌రెడ్డి మరణ వార్తను తెలుసుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు. - 8లో



తెగిపడిన విద్యుత్ తీగలు

గుర్రంకొండలో వర్షానికి 11 కేవీ విద్యుత్ తీగలు ఒక్కసారిగా తెగిపడ్డాయి. అయితే అక్కడ జనసంచారం లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.420	రూ.530
రెండోరకం	రూ.280	రూ.410

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 156 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి



ప్రజల అర్జీలను పరిశీలిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి : బాధితుల ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా చట్ట పరిధిలో పరిష్కరించాలని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి ఆదేశించారు. సోమవారం జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అదనపు ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ చేసి వారి సమస్యలను పరిష్కరిస్తామని అదనపు ఎస్పీ తెలిపారు.

డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలి



జిల్లా కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

రాయచోటి : మదనపల్లె డివిజన్ అభివృద్ధికి అన్ని శాఖల సహకారంతో ముందుకు సాగాలని నూతన సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన చల్లా కల్యాణికి జిల్లా కలెకట్ ఛామకూరి శ్రీధర్ సూచించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్‌ను మదనపల్లి సబ్ కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణిని అభినందించారు. అనంతరం మదనపల్లిలోని తన కార్యాలయంలో సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

బాధ్యతల స్వీకరణ



రాయచోటి మున్సిపల్ కమిషనర్ జి.రవి

రాయచోటి జగదాంబ సెంటర్ : రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా జి.రవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయానికి టీపీఆర్‌ఓగా బదిలీ అయ్యారు. ఏపీ గ్రీనరీ, బ్యూటిఫికేషన్‌లో జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్న జి.రవి రాయచోటి కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ఈయన గతంలో తాడిపత్రి, మదనపల్లి, ఆముదాలవలస మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పట్టణంలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తామని, స్వచ్ఛ రాయచోటినే లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రమాణ స్వీకారానికి మంత్రి హాజరు



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని రాజ్‌రెసిడెన్సీలో జరిగిన మార్కెట్ కమిటీ చైర్మన్ వరలక్ష్మి ప్రమాణ స్వీకారానికి సోమవారం రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరయ్యారు. అనంతరం ఆయన వెంటనే వెళ్లిపోయారు. మొదటిసారి కోడూరుకు వచ్చినప్పటికీ అభివృద్ధిపై సమీక్షించకుండా, హామీలు ఇవ్వకుండా పర్యటన ముగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కారూపానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైలవరం నుంచి నీటి విడుదల

జమ్మలమడుగు : మైలవలరం జలాశయం నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేసినట్లు ఈఈ రమేష్ పేర్కొన్నారు. గండికోట జలాశయం నుంచి ఐదువేల క్యూసెక్కుల నీరు మైలవరం జలాశయంలోకి వస్తోందని ఆయన తెలిపారు. ఈ నీటిని దిగువనున్న పెన్నానదిలోకి విడుదల చేస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 1500 క్యూసెక్కులు సాయంత్రానికి ఐదు వేల క్యూసెక్కుల నీరు జలాశయం నుంచి దిగువకు పోతుందన్నారు.

పోలింగ్‌కు వేళాయె

- నేడు ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- 13 పంచాయతీలకు గాను నాలుగు సమస్యాత్మక కేంద్రాలు
- అన్ని గ్రామాల్లో ప్రచారం పూర్తి చేసి జోరు మీదున్న వైఎస్సార్‌సీపీ
- ఓటర్ల స్లిప్పులు తీసుకుని కుయుక్తులు పన్నుతున్న టీడీపీ



బ్యాలెట్ బాక్సులు తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది




బ్యాలెట్ బాక్సులతో బస్సు ఎక్కడానికి సిద్ధంగా ఉన్న ఎన్నికల సిబ్బంది

సాక్షి రాయచోటి : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి మంగళవారం పోలింగ్ జరగనుంది. సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట స్థానం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఆకేపాటి అమరనాథరెడ్డి గెలుపొందడంతో.. అంతకుముందు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్‌తోపాటు జెడ్పీటీసీ స్థానానికి ఆయన రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి నామినేషన్ వేశారు. సుబ్బారెడ్డితోపాటు మరో పది మంది నామినేషన్ వేసి బరిలో ఉన్నారు. జూలై నెలాఖరు నుంచి అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించింది. వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థికి మద్దతుగా ఆ పార్టీ కీలక నేతలు ఉత్సాహంగా పాల్గొనడం, ప్రచారం చివరిరోజు ఒంటిమిట్టలో అపూర్వ స్పందన లభించడంతో గెలుపు నల్లేరుపై నడకేనని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

కూటమి కుయుక్తులు

ఒంటిమిట్ట జెడ్పీటీసీ పరిధిలో టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డికి అభ్యర్థిత్వం ఖరారు చేయడంలోనే ఆలస్యం కావడంతో ప్రచారంలో వెనుకబడ్డారు. మంత్రులు వచ్చినా ఆదరాబాదరాగా అక్కడక్కడా ప్రచారం నిర్వహించి వెళ్లారు. అయితే కూటమి సర్కార్ ఆది నుంచి ప్రతిష్టాత్మకంగా భావించడంతో గెలుపు కోసం అడ్డదారులను వెతుకుతున్నారు. ఓట్లకు నోట్ల పండుగ రుచి చూపి ఏకంగా ప్రభుత్వ సిబ్బంది పంపిణీ చేసిన ఓటరు స్లిప్పులను టీడీపీ కార్యకర్తలు తీసుకెళ్లడంపై దవతరంపల్లె ఎస్టీ కాలనీ ప్రజలు తిరగబడ్డారు. ఇలా ఒక రకంగా, ఇంకో చోట మరో రకంగా ఏదో ఒక రకంగా ఓట్లను ఏమార్చే దిశగా అడుగులు వేశారు. పెద్ద ఎత్తున ఓటర్లకు నగదు, మద్యం పంపిణీ చేస్తున్నట్లు తెలియవచ్చింది. ఎన్నికల పోలింగ్ ముందురోజు కూటమి సర్కార్ కుయుక్తులపై ప్రజలు ముక్కు మీద వేలేసుకుంటున్నారు.



మండల పరిధిలో 24,606 మందికి ఓటుహక్కు

ఒంటిమిట్ట మండల పరిధిలో జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి 24,606 మంది ఓటు కలిగి ఉన్నారు. మండలంలోని 13 పంచాయతీలకు గాను 17 పోలింగ్ కేంద్రాల్లో 30 పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. సుమారు నాలుగు గ్రామాల పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. మండలంలో సుమారు 650 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు విధుల్లో నిమగ్నమవుతున్నారు. స్ట్రైకింగ్ ఫోర్స్, మొబైల్ పార్టీ, ఇతర అన్ని ఫోర్స్‌లను వినియోగిస్తున్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు కొనసాగుతోంది.

పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది

జెడ్పీటీసీ ఎన్నిక నేపథ్యంలో సోమవారం పోలింగ్ సిబ్బంది కేంద్రాలకు చేరుకున్నారు. ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారితోపాటు ఇతర పోలింగ్ అధికారులు, సిబ్బంది బ్యాలెట్ బాక్సులతోపాటు ఇతర సామగ్రిని తీసుకుని కేంద్రాలకు చేరుకున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 230 మందికి పైగా సిబ్బంది ఒంటిమిట్టతోపాటు పల్లెల్లోని కేంద్రాలకు చేరారు.

నేడు పోలింగ్

ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి మంగళవారం ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. అందుకు సంబంధించి యంత్రాంగం ఇప్పటికే అన్ని చర్యలు చేపట్టింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. మండలంలోని సుమారు 23,606 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల అధికారులు అందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసి సర్వం సన్నద్ధమయ్యారు.

➠ సర్వం సిద్ధం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికకు సంబంధించి ఆదివారం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రంగస్వామి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బ్యాలెట్ బాక్సులను సంబంధిత ఎన్నిక నిర్వహణ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి బూత్‌కు సంబంధించిన ఎన్నికల సామగ్రిని ఆయా బూత్ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ ఆఫీసర్ మాట్లాడుతూ మండలంలో 17 ప్రాంతాలలో 30 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 24606 ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్క ఓటరు ధైర్యంగా వెళ్లి తమ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా ఇంకా అక్కడక్కడా ఓటర్లు స్లిప్‌లు అందని వారికి పోలింగ్ కేంద్రాలలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని వివరించారు. ఉప ఎన్నిక నిర్వహించేందుకు మండలం మొత్తం 230 మంది ఎన్నికల సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్ (పీఓ, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ (ఏపీఓ), ముగ్గురు ఓపీఓలు కలిపి ఐదుగురు సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

ఓటరు స్లిప్పు లేకున్నా గుర్తింపు కార్డుతో ఓటు

- పోలింగ్ జరిగే అన్ని గ్రామాలకు బస్సులు, ఆటోలు
- కడప కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



కడప సెవెన్‌రోడ్స్ : పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో మంగళవారం జరగనున్న పోలింగ్‌లో ఓటర్లంతా నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే జెడ్పీటీసీ ఎన్నికల్లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. బ్యాలెట్‌బాక్సుల ద్వారా పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ మెటీరియల్ ఆయా పోలింగ్ కేంద్రాలకు పంపామన్నారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వివరాలతో కూడిన స్లిప్పులను పంపిణీ చేశామన్నారు. ఒకవేళ ఎవరికైనా ఓటరు స్లిప్పులు లేకపోతే గుర్తింపు కార్డుతో వెళ్లి వివరాలు తెలియజేసి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లు తప్పకుండా తమ వెంట ఫొటో గుర్తింపు కార్డును తీసుకెళ్లి ఓటు వేయాలన్నారు. పోలింగ్ జరిగే అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు, ఆటోలు అందుబాటులో ఉంచామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద నలుగురు సిబ్బందితో హెల్ప్‌డెస్క్ ఉంటుందన్నారు. క్యూలైన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా అనవసరమైన రెచ్చగొట్టే వదంతులు ప్రసారం చేసినా, స్పందించకుండా ఓటర్లు ప్రశాంతంగా ఓటు వేయాలన్నారు. సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్‌లో నిలుచున్న వారందరితో ఓటు వేయిస్తారన్నారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



రాయచోటిలో జాతీయ జెండాతో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, అధికారులు

రాయచోటి : ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఘనంగా నిర్వహించారు. సోమవారం రాయచోటిలో విద్యా, పర్యాటకతోపాటు పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ జెండా ఊపి ప్రారంభించారు. రాయచోటిలోని చిత్తూరు రోడ్డు వద్ద ఉన్న శివాలయం నుంచి బంగ్లా సర్కిల్ వరకు నిర్వహించారు. అక్కడ విద్యార్థిని, విద్యార్థులతోపాటు కలిసి అధికారులు, సిబ్బంది మానవహారంగా ఏర్పడ్డారు. అక్కడ జాతీయ గీతాన్ని ఆలపించారు. ర్యాలీలో వంద మీటర్ల జాతీయ జెండా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం, డీఐఈఓ రవికుమార్, డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ అజయ్ కుమార్, డీఈఓ సుబ్రమణ్యం, డీఎస్పీ కృష్ణమోహన్, జీఎస్‌డబ్ల్యూ లక్ష్మీపతి, రాయచోటి తహసీల్దార్ నరసింహ కుమార్, ఎంపీడీఓ సురేష్ బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల బాలబాలికలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



నులిపురుగుల నివారణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

రాయచోటి టౌన్ : నులిపురుగుల నివారణతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. మంగళవారం విద్యార్థులకు అల్బెండజోల్ పంపిణీ కార్యక్రమం నిర్వహణలో భాగంగా సోమవారం రాయచోటి నియోజక వర్గంలోని లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, రామాపురం, రాయచోటి ప్రాంతాలలోని పాఠశాలలు, హాస్టళ్లు, అండన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లలకు పంపిణీ చేసేందుకు ఉంచిన ఐఈసీ సామగ్రిని పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించే అధికారులతో సమావేశం నిర్వహించి, విజయవంతం చేసేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అంతకు ముందుగా నులిపురుగుల నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కన్సల్టెంట్ హరికృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య, డీఐవో డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ రియాజ్ బేగ్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇ.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

గాలివీడు : విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అనిల్ కుమార్ సూచించారు. మండలంలోని నూలివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ నిర్లక్ష్యం చేయకుండా ఐరన్ మాత్రలు, అల్బెండాజోల్ మాత్రలు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రియాజ్, డాక్టర్ శ్వేతా, వైద్య సిబ్బంది, ప్రధానోపాధ్యాలు రాజశేఖర్, ఉపాధ్యాయులు మనోహర్, ఫయాజ్, హరీష్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇరగంరెడ్డి ఫామ్‌హౌస్‌ను ముట్టడించిన పోలీసులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట జెడ్పీటీసీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ఫామ్‌హౌస్‌ను సోమవారం రాత్రి పోలీసులు ముట్టడించారు. ఈ సందర్భంగా ఫామ్ హౌస్‌లో ఉన్న 12 మంది వివరాలు సేకరించి, వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు లాక్కున్నారు. అనంతరం పోలీసులు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఇలా గుంపులుగా ఉండకూడదన్నారు. ఫామ్‌హౌస్‌లో డబ్బు పంపిణీ జరుగుతుందనే సమాచారంతో ఇక్కడకు వచ్చామని, కానీ ఇక్కడ అలాంటివి ఏమీ జరగలేదని చెప్పారు. ఫామ్‌హౌస్‌కు సంబంధించిన వారు తప్ప మిగతా వారంతా ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. దీంతో అక్కడున్న వారందరినీ పోలీసులు పంపించేశారు.

ఎన్నికల ప్రక్రియపై సూచనలు కీలకం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీధర్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడానికి రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు కీలకమని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అన్నమయ్య జిల్లాలో ఓటర్ల సవరణ – 2025, పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, వివిధ రకాల ఫారంలు తదితర అంశాలపై పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో గత సమావేశంలో చర్చించిన వివిధ విషయాలు, సంబంధిత చర్యలను డీఆర్‌ఓ మధుసూధనరావు క్లుప్తంగా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీఎల్‌ఏలను నియమించి సంబంధిత నియామక పత్రాలను ఈఆర్‌ఓలకు సమర్పించాలని తెలిపారు. బీఎల్‌ఓలపై సమీక్షిస్తూ జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖలో బదిలీల కారణంగా చాలా మంది బీఎల్‌ఓలు మారారని సంబంధిత వివరాలను రాజకీయ పార్టీలకు అందజేయాలని డీఆర్‌ఓకు సూచించారు. సమావేశంలో రాజంపేట మదనపల్లె సబ్ కలెక్టర్లు హెచ్ఎస్ భావన, చల్ల కళ్యాణి, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన

రాయచోటి జగదాంబసెంటర్ : ఇండియా ఫైట్స్ హెచ్ఐవీ అండ్ ఎస్‌టీఐ అనే థీమ్‌తో హెచ్ఐవీ నిర్మూలనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా హెచ్ఐవీ/ఎయిడ్స్ నిర్మూలన, నియంత్రణ మండలి(డీఏపీసీయూ) రూపొందించిన గోడపత్రికను పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవీ లేదా ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ గోడపత్రికలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ లేదా ఇతర సుఖ వ్యాధులు పట్ల అవగాహనతో ఎక్కువ మంది హెచ్ఐవీ రక్త పరీక్షలు చేసుకునేలా ముందుకు రావడం జరుగుతుందని పేర్కొన్నారు. హెచ్ఐవీ బాధితుల పట్ల ఉన్న చిన్నచూపు, వివక్షతను రూపుమాపేందుకు హెచ్ఐవీ చట్టం 2017, టోల్‌ఫ్రీ నంబర్ 1097 మొదలైన వాటిపై అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. ఈ ఆవిష్కరణలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా వైద్య శాఖ అధికారి లక్ష్మీనరసయ్య, పీసీఎస్ఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ టి.స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులు లేని పిల్లల సంరక్షణకు చర్యలు

రాయచోటి టౌన్ : 'కలిసొచ్చే కాలానికి– నడిసొచ్చే పిల్లలు' అనే పోస్టర్‌ను కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోస్టర్ కేర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కేర్ సెంటర్ ద్వారా 6 –18 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న తల్లిదండ్రులు లేని, సంరక్షణ లేని పిల్లలను వారి అదుపులోకి తీసుకొని రెండు సంవత్సరాలు పాటు పెంచి తరువాత శాశ్వత దత్తత (అడ్వాప్షన్) చేసుకొంటుందన్నారు. ఇది పూర్తిగా తల్లిదండ్రులు లేని, సంరక్షణ లేని పిల్లలకు సంరక్షణ అందించే వ్యవస్థన్నారు. పెంచడంతోపాటు వారికి ప్రేమ, భద్రత, స్థిరత్వం అందిస్తారన్నారు. అలాగే వారికి చదువు, ఆరోగ్యంతోపాటు భావోద్వేగ అవసరాలను కూడా తీర్చుతుందన్నారు. తరువాత మంచి చదువుతోపాటు వారి స్థిరమైన జీవనాన్ని, ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందని తెలిపారు. దీనిపై ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని, గ్రామాలలో, వార్డులలో చర్చించి అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం మహిళ శిశు సంక్షేమ శాఖ రాయచోటి, అన్నమయ్య జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. దీని కోసం www.care.wcd.gov.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడంతోపాటు సంప్రదించవచ్చుని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఆర్‌డీవో శ్రీనివాస్, ఏడీ సర్వే భరత్‌కుమార్, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఉప ఎన్నికకు పటిష్ట భద్రత



దిశా నిర్దేశం చేస్తున్న పోలీస్ అధికారులు



సమావేశంలో పాల్గొన్న పోలీసు యంత్రాంగం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నిక శాంతియుతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని టీటీడీ విడిది గృహంలో జెడ్పీటీసీ ఉప ఎన్నిక భద్రత విధులను నిర్వహించేందుకు వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటును వినియోగించుకునేలా పోలీసులు భద్రత కల్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎక్కడే గానీ జనాలు గుమికూడేలా ఉండకుండా విధులు నిర్వహించాలన్నారు. ఈ ఉప ఎన్నికకు మొత్తం 625 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాండవ్య నది నీటిని మళ్లించారు


రాయచోటి టౌన్ : మాండవ్య నదిపై నిర్మించిన చెక్‌డ్యామ్ పక్కన కాలువ ఏర్పాటు చేసి నీటిని మళ్లించారని దీనిపై పరిశీలించి తమకు న్యాయం చేయాలని ఓదివీడు గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ నది పరివాహక ప్రాంతంలో ఓదివీడు, కస్పా, బెస్తపల్లె, గంగరాజుపల్లె, పత్తిరాజుగారి పల్లె, మట్లి గ్రామాలకు చెందిన దాదాపు 500 ఎకరాల భూముల్లో పంటలు పండించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. చెక్‌డ్యాం ఎత్తును తగ్గించి తమకు న్యాయం చేయాలని కోరారు.

బావిలో పడి వ్యక్తి మృతి


బావిలో పడి మృతి చెందిన చిన్నప్ప

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం కుమ్మరపల్లె పంచాయతీ ఎగువ దళితవాడకు చెందిన రేనిమాని చిన్నప్ప(52) అనే వ్యక్తి బావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బావిలో మోటారు చెడిపోయిందని చూసేందుకు వెళ్లి సోమవారం ఉదయం బావిలో పడిపోయాడు. కొద్ది గంటల పాటు పైకి రాకపోవడంతో గ్రామస్తులు ఆయన ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చిన్నప్ప బావిలో ఉన్న మోటారు కింద పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తెగిపడిన విద్యుత్ తీగలు


బస్టాండులో దుకాణాలపై తెగిపడిన విద్యుత్ తీగలు

గుర్రంకొండ: వర్షాలకు 11 కేవీ విద్యుత్ తీగలు ఒక్కసారిగా తెగిపడ్డాయి. అయితే అక్కడ జన సంచారం లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. సోమవారం గుర్రంకొండ బస్టాండులో హోరున వర్షం కురుస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఒక్కసారిగా 11 కేవీ విద్యుత్ తీగలు తెగి ఓ వైపు దుకాణాల మీద మరోవైపు నిత్యం జనాలు కూర్చొనే బల్లల వద్ద పడ్డాయి. ఆయితే వర్షం కారణంగా సకాలంలో అక్కడ జనసంచారం లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. వెంటనే బస్టాండులో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ట్రాన్స్‌కో సిబ్బంది అక్కడికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు.

ఆవుల కుటుంబానికి వైఎస్ జగన్ పరామర్శ


వేణుగోపాల్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల


ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డిని పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి

సంబేపల్లె : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆవుల వేణుగోపాల్ రెడ్డి మరణ వార్తను మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ద్వారా తెలుసుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు. సోమవారం ఆవుల కుమారులు ఆవుల విష్ణువర్దన్ రెడ్డి, ఆయన సోదరుడు ఆవుల మల్లికార్జున రెడ్డిలతో ఫోన్‌లో మాట్లాడి తీవ్ర సంతాపం ప్రకటించారు. అలాగే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డిలు కూడా ఫోన్ ద్వారా తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

నివాళులు అర్పించిన ప్రముఖులు..

రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, మాజీ ఎమ్మెల్యేలు గడికోట మోహన్ రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రా రెడ్డి, ద్వారక నాథ్ రెడ్డి, లక్ష్మీదేవమ్మ, దేశాయి తిప్పారెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ మదనపల్లె ఇన్‌చార్జ్ నిస్సార్ అహ్మద్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ అహమ్మద్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి తదితరులు ఘనంగా నివాళులు అర్పించారు.

విలేకరి బెదిరిస్తున్నాడని మహిళా సర్పంచ్ ఫిర్యాదు


నరసాపురం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ రమణకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ సుభద్రమ్మ

కాశినాయన : మండలంలోని కత్తెరగండ్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ చెన్నుపల్లె సుభద్రమ్మ తనను మహబూబ్ బాషా అనే పత్రికా విలేకరి వేధిస్తున్నాడని సోమవారం నరసాపురం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ రమణకు ఫిర్యాదు చేశారు. తాను విలేకరినని, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతికి పీఏను అని పాత పనులకు బిల్లు ఇవ్వాలని బెదిరిస్తున్నాడని సర్పంచ్ తెలిపారు. 2017–18 సంవత్సరంలో తాను గ్రామ పంచాయతీ కార్యాలయంలో మరుగుదొడ్డిని నిర్మించానని, అప్పుడు తనకు బిల్లులు రాలేదని, ఇప్పుడు బిల్లులు ఇవ్వాలని వేధిస్తున్నాడని పేర్కొన్నారు.

సర్పంచ్‌పై విలేకరి ఫిర్యాదు

రూ.50 లక్షలు గ్రామ పంచాయతీలో అవినీతి జరిగిందని పత్రికలో తాను వార్త రాసినందుకు సర్పంచ్, ఆమె బంధువులు తనను చంపుతామని బెదిరిస్తున్నారని నరసాపురం పోలీస్ స్టేషన్‌లో విలేకరి మహబూబాషా ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఎర్రచందనం కేసులో ఒకరికి ఏడాది జైలు

తిరుపతి లీగల్ : ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో మదనపల్లి, కొత్త ఇండ్లు, రంగారెడ్డి కాలనీకి చెందిన కొల్లై రవి అలియాస్ బాబుకు ఏడాది జైలు శిక్ష, పదివేల రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతిలోని ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ జడ్జి ఎస్.శ్రీకాంత్ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. కడప ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది 2010 ఫిబ్రవరి 23వ తేదీ కడప డివిజన్, కడప రేంజ్, ఆలంఖాన్‌పల్లి అటవీ ప్రాంతం సమీపంలో నిందితుడు రవి మరో ఇద్దరితో కలిసి 3703 కిలోల 146 ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా ఫారెస్ట్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి కేసు పూర్వాపరాలు పరిశీలించి ఈమేరకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

అక్రమ వసూళ్లు రూ.16.40 లక్షలు

- అందులో రూ. 7 లక్షలు నగరపాలక సంస్థకు చెల్లింపు
- రూ. 4.20 లక్షలకు ఆధారాలు లభ్యం
- ఆరు బృందాలతో 2414 మందిని విచారణ
- మీడియాతో కడప నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలో 2024 ఆగస్టు నెల నుంచి సుమారు రూ.16.40 లక్షలు యూజర్ చార్జీల పేరుతో అక్రమ వసూళ్లు చేసినట్టు తేలిందని కమిషనర్ మనోజ్ రెడ్డి వెల్లడించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం యూజర్ చార్జీలు వసూలు చేయవద్దని చెప్పినప్పటికీ వ్యాపార సంస్థల నుంచి క్లాప్ యూజర్ చార్జీలు వసూలు చేశారని వచ్చిన ఆరోపణలపై ఆరు ప్రత్యేక బృందాలతో పూర్తిస్థాయి విచారణ చేపట్టామన్నారు. ఇందులో భాగంగా 2414 మందిని విచారించగా 258 మంది తాము యూజర్ చార్జెస్ ఇచ్చామని చెబుతూ అందుకు సంబంధించిన రసీదులు, ఆధారాలు చూపారన్నారు. మిగిలిన 2156 మంది తాము ఎలాంటి యూజర్ చార్జీలు చెల్లించలేదని చెప్పారన్నారు. రూ.4,20,750లకు స్లిప్పులు తగిన ఆధారాలు ఉన్నాయని, రూ.12,19,500లకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఇందులో 2024 ఆగస్టు నుంచి కార్పొరేషన్‌కు రూ.7 లక్షలు జమ అయిందన్నారు. తమ విచారణలో బయటపడిన నాలుగు లక్షల 20 వేల 750 రూపాయలు కూడా ఇందులో ఉన్నాయని తెలిపారు. దీనిపై ఇదివరకే ఎనిమిది మందిపై చర్యలు తీసుకున్నామని, ఇప్పుడు మరో ఏడుగురు శానిటరీ సెక్రటరీలు, ముగ్గురు ఆప్కాస్ సిబ్బందిపై చర్యలు తీసుకున్నామన్నారు. ఇంకా ఎవరి దగ్గరైనా ఆధారాలు ఉంటే తెలపాలని, వాటిపై కూడా విచారణ చేస్తామన్నారు. ఇకపై యూజర్ చార్జీలు వసూలు చేయకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

అనధికారికంగా లేఔట్‌లు వేసిన వారు, అందులో ప్లాట్లు కొన్నవారు 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. 2025 జూన్ 30కి ముందు రిజిస్టర్ అయిన ప్లాట్ల యజమానులు ఈ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. 45 రోజుల్లో మొత్తం ఫీజు చెల్లించిన వారికి 10 శాతం, 90 రోజుల్లో చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ఉంటుందన్నారు. ఓపెన్ స్పేస్ చార్జీలు ఏడు శాతం చెల్లిస్తే సరిపోతుందన్నారు. కడప నగరంలో సుమారు వందకు పైగా అనధికారిక లేఔట్‌లు ఉన్నాయని, వీరంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


రాజన్న (ఫైల్)

మదనపల్లె రూరల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపల్లె మండలం బీఎస్ రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న అట్లూరి రాజన్న(65) ఈనెల 7వ తేదీ సాయంత్రం ఎర్రగానిమిట్ట సమీపంలో ఆటో కోసం రోడ్డుపై వేచి ఉండగా, అదే సమయంలో అటువైపుగా వచ్చిన గుర్తు తెలియని ఇన్నోవా కారు ఢీకొని వెళ్లిపోయింది. దీంతో తీవ్రగాయాల పాలైన రాజన్నను స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టీటీడీకి రూ.10 లక్షలు విరాళం

తిరుమల : వైఎస్సార్ జిల్లాకు చెందిన సీఆర్ అసోసియేట్స్ సంస్థ అధినేత చరణ్ తేజ్ టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు సోమవారం రూ.10,10,116 విరాళంగా అందించారు. ఈమేరకు దాత తిరుమలలోని టీటీడీ అదనపు కార్యాలయంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి విరాళం డీడీ అందజేశారు.

కిక్కుకు.. పర్మిట్!

- మద్యం షాపులకు అనుగుణంగా పర్మిట్ రూములు
- నెలాఖరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు కసరత్తు
- అప్పటివరకు కూడా ఆగని మద్యం వ్యాపారులు
- ఇప్పటికే అనధికారికంగా ఏర్పాటు



తకడప వైఎస్ఆర్ సర్కిల్ : మద్యం షాపులకు అనుబంధంగా పర్మిట్ రూముల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం పచ్చ జెండా ఊపేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం బార్ అండ్ రెస్టారెంట్ అనుమతి పునరుద్ధరణ ప్రక్రియ జరుగుతోంది. దీనిని ఈ నెలాఖరుకు పూర్తి చేయడంపై ఎక్సైజ్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే మద్యం షాపులకు అనుబంధంగా పర్మిట్ రూముల ఏర్పాటుకు మార్గదర్శకాలు వెలువడనున్నాయి. వాస్తవానికి మద్యం షాపులు ప్రారంభమైనప్పటి నుంచే వాటి యజమానులు చాలా చోట్ల గుట్టు చప్పుడు కాకుండా పర్మిట్ రూములు ఏర్పాటు చేసేశారు. ఇప్పుడు ప్రభుత్వమే దీనికి అనుమతులు ఇస్తుందన్న సమాచారంతో ఇంకా విచ్చల విడిగా పర్మిట్ రూములు తెరిచి పూర్తిగా తాగించేస్తున్నారు. గ్లాసులు, వెజ్, నాన్ వెజ్, స్నాక్స్ ఏర్పాటు చేసి మరీ విక్రయిస్తున్నారు. అర్ధరాత్రి వరకు తెరిచే ఉంచుతున్నారు. దీంతో మందుబాబులు అక్కడే తాగి తూలుతుండడంతో అటుగా వెళుతున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు

పర్మిట్‌కు రైట్ రైట్...

మద్యం ద్వారా వస్తున్న ఆదాయాన్ని మరింతగా పెంచుకునేందుకు కూటమి ప్రభుత్వం కొత్త మార్గాలు వెతుకుతోంది. ఇందులో భాగంగా మద్యం దుకాణం వద్దే పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విధానాన్ని పునః ప్రారంభించే దిశగా ఎక్సైజ్ శాఖ ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. ఈ నెలాఖరులోపు పర్మిట్ రూములకు అనుమతులివ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసింది. నూతన విధానంలో భాగంగా కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టింది. అప్పటి నుంచి జిల్లావ్యాప్తంగా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 153 మద్యం షాపులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీటికి అనుబంధంగా ఒక్కొక్కటిగా చొప్పున 153 సిట్టింగ్ రూములు ఏర్పాటు కానున్నాయి. కార్పొరేషన్, మున్సిపల్ పరిధిలో పర్మిట్ రూమ్‌కు రూ.7.50 లక్షలు ఇతర ప్రాంతంలో రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం ఫీజు ప్రకటించింది. సగటు చొప్పున ఒక్కో షాపునకు రూ.5 లక్షలు వసూలు చేసిన ప్రభుత్వానికి అదనంగా రూ.80 కోట్లు ఆదాయం సమకూరనుంది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అన్ని పర్మిట్ దుకాణాలకు ఏడాదికి రూ.5 లక్షలు పరిమిత ఫీజుగా ఉండేది. ఇప్పుడు దానిని రెండు కేటగిరీలుగా మారుస్తున్నారు.

ఆదాయమే లక్ష్యమా..

ఆదాయమే లక్ష్యంగా ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకు వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 153 మద్యం షాపులకు గాను 3100 దరఖాస్తులు రాగా ఒక్కొక్కరి నుంచి రూ. 2 లక్షలు చొప్పున ప్రభుత్వం వసూలు చేసింది. తద్వారా రూ.62 కోట్లు ఆర్జించింది. షాపులు దక్కించుకున్న వ్యాపారులు ఆరు విడతల్లో లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. లైసెన్స్ ఫీజుల్లో 1/6 వంతు చెల్లించారు. పర్మిట్ రూములు సైతం అందుబాటులోకి వస్తే ఆదాయం మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ప్రభుత్వమే ఆదాయం లక్ష్యంగా మద్యాన్ని ఏరులై పారిస్తోందని దీనివల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదం పొంచి ఉంటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే సమస్త సౌకర్యాలతో...

ఇప్పటికే ప్రతి షాపు వద్ద ఒక పర్మిట్ రూమును అనధికారికంగా తెరిచేశారు. అది కూడా ఏదో చిన్న గది అనుకుంటే పొరపాటే. సువిశాల ప్రాంగణంలో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి మరీ ఏర్పాటు చేశారు. మందుబాబులు కూర్చుని తాగేందుకు కుర్చీలు, టేబుళ్లు, వేశారు. వర్షం, ఎండా పడకుండా విశాలమైన షెడ్లు వేసి బయటికి తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. షెడ్ల లోపల పెద్ద ఫ్లడ్‌లైట్‌లు వేసి మరీ మందు అందజేస్తున్నారు. మంచింగ్ కోసం అన్ని రకాల నాన్ వెజ్ ఆహార పదార్థాలను అక్కడే ఉంచుతున్నారు. ఎంత సేపైనా కూర్చునేందుకు అవకాశం కల్పిస్తుండడంతో మద్యం ప్రియులు ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడే తప్ప తాగి తూలుతున్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి జైలు నుంచి విడుదల కావాలని ప్రార్థనలు


దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు

పీలేరు రూరల్ : అక్రమ మద్యం కేసులో అరెస్ట్ అయిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి జైలు నుంచి విడుదల కావాలని కోరుతూ సోమవారం పీలేరు నియోజకవర్గంలోని ముస్లింలు కర్ణాటకలో ప్రసిద్ధ మురగముల్లా అమ్మాజాన్ బావాజాన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం పెద్దిరెడ్డి కుటుంబంపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా ఎంపీని అరెస్ట్ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా, మైనారిటీ నాయకులు అబ్దుల్ కలీమ్, కలకడ కరీముల్లా, ఎస్. అబీద్, అత్తార్ కాలేషా, షాజహాన్, ఖాదర్‌బాషా, అమీన్‌పీర్, సమీ, జాకీర్, ఇమ్రాన్, అలీఅస్గర్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ డ్రైవర్ ఆత్మహత్య


అనిల్ కుమార్ (ఫైల్)

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలు, ఆటో తీసివ్వలేదని మనస్తాపంతో టిప్పర్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం సాయంత్రం వెలుగు చూసింది. గాలివీడు మండలం సలారివారిపల్లెకు చెందిన బాలయ్య, నారాయణమ్మ దంపతుల రెండో కుమారుడు మల్లూరి అనిల్‌కుమార్(32)కు బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెకు చెందిన రవి కుమార్తె స్వరూపతో పదేళ్ల క్రితం పెళ్లయింది. అనిల్‌కుమార్ టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఐదేళ్ల క్రితం ఉపాధి కోసం మదనపల్లెకు వచ్చి బసినికొండ అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. వీరికి కుమారుడు జేమ్స్‌కింగ్(6), కుమార్తె లిప్సిక(4) ఉండగా, వారు బడికాయలపల్లెలో అమ్మమ్మ వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. భార్య స్వరూప మదనపల్లెలోని ఓ హోటల్‌లో పనిచేసేది. ఈ క్రమంలో కొంతకాలం క్రితం టిప్పర్ డ్రైవర్‌గా పనిమానేసి ఆటో కొనుగోలు చేయాలని అనిల్ భార్యతో చర్చించాడు. అందుకు అవసరమైన నగదు అత్తింటివారిని అడగమని భార్యకు చెప్పి ఇద్దరూ వెళ్లి అడిగారు. అయితే అత్తింటివారు తాము నగదు సమకూర్చలేమని తేల్చి చెప్పారు. దీంతో ఇంటికి చేరుకున్న భార్యాభర్తలు ఇదే విషయమై గొడవపడ్డారు. భార్య తాను పనిచేసి నగదు సమకూర్చుతానని, వారంరోజుల క్రితం తిరుపతికి వెళ్లి ఓ హోటల్‌లో పనికి కుదిరింది. భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిన అనంతరం అనిల్‌కుమార్ ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే నాలుగురోజులుగా ఈ విషయాన్ని ఎవరూ గుర్తించకపోవడంతో సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో ఎదురింట్లోని వ్యక్తి కిటికీలో నుంచి ఇంట్లోకి తొంగి చూశాడు. అనిల్ ఉరికి వేలాడుతున్న విషయం గుర్తించి తాలూకా పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో తాలూకా ఎస్ఐ గాయత్రి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి నారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు.

అతి వేగం.. ఆపై సెల్‌ఫోన్ మాట్లాడుతూ..

- లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం
- యువకుడికి తీవ్ర గాయాలు



పుల్లంపేట : ఓ చేత్తో బైకు రైడింగ్.. మరో చేత్తో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వేగంగా వెళ్లి నిలిచి ఉన్న లారీని ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో కడప–రేణిగుంట జాతీయ రహదారిపై సోమవారం ఈ ప్రమాదం జరిగింది. పుల్లంపేట మండలం, కొత్తపేట గ్రామానికి చెందిన పోలిచెర్ల సునీత, శ్రీను దంపతుల కుమారుడు పోలిచెర్ల వినయ్ సోమవారం మధ్యాహ్నం రాజంపేట నుంచి ద్విచక్ర వాహనంపై అధిక వేగంతో సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ వెళ్లాడు. మోడల్ స్కూల్ సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నిలబడి ఉన్న లారీని వెనుకవైపు నుంచి ఢీ కొట్టాడు. దీంతో వినయ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు రాజంపేట ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పి లోయలో పడిన సిమెంట్ లారీ


గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో లోయలో పడిన సిమెంట్ లారీ

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్‌లోని రెండవ మలుపు వద్ద సిమెంట్ లారీ సోమవారం అదుపు తప్పి లోయలో పడిపోయింది. రామాపురం పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. చిత్తూరు జిల్లా బంగారుపాలెంకు చెందిన లారీ డ్రైవర్ ధనుంజయ ఎర్రగుంట్ల నుంచి బెంగళూరుకు ఎస్ఎల్ 01 ఎల్ 1786 నంబర్ గల లారీలో సిమెంట్ తీసుకువెళ్తుండగా అదుపు తప్పి లోయలో పడిపోయింది. స్థానికుల సాయంతో పోలీసులు డ్రైవర్‌ను బయటకు తీసి రక్షించారు. గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

• అబ్బో.. ఎంత పెద్ద చేపో



'అబ్బో ఎంత పెద్ద చేపో'... అంటూ చూపరులు ఆశ్చర్య పోయిన సంఘటన సోమవారం ములకలచెరువు మండలంలో చోటు చేసుకుంది. మద్దినాయునిపల్లె చెరువులోకి వర్షం కారణంగా కొత్త నీరు చేరడంతో చేపలు వచ్చాయి. గమనించిన చుట్టుపక్కల ప్రజలు పెద్ద వలల సాయంతో చేపలను పట్టుకున్నారు. ఇందులో క్యాట్‌ఫిష్ (మారవ) చేపలు 5 కేజీల నుంచి 15 కేజీల వరకు ఉన్నాయి. చేపలను బురకాయలకోటలో కిలో రూ.100కి విక్రయించారు. స్థానికులు వాటిని కొనడానికి ఎగబడ్డారు.

– ములకలచెరువు

కారు ఇస్తే కానిస్టేబుల్‌కు కుదువ పెట్టాడు!

కడప రూరల్ : స్నేహితుడే కదా అని కారు ఇచ్చాను...అతను తన కారును ఒక కానిస్టేబుల్‌కు కుదువ పెట్టుకున్నాడని బద్వేలు నియోజకవర్గం గోపవరానికి చెందిన సిద్దయ్య తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన బతుకుతెరువు కోసం 2023లో టయోటా కారును కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్నట్లు తెలిపాడు. కొన్ని నెలల క్రితం బద్వేల్‌కు చెందిన తన మిత్రుడు వచ్చి ఒక వారం కారు కావాలని అడిగితే ఇచ్చానని పేర్కొన్నాడు. వారం దాటినా అతను తన కారును ఇవ్వకపోవడంతో విచారించగా తన మిత్రుడు కారును ఒక కానిస్టేబుల్‌కు కుదువ పెట్టినట్లు తెలిసిందన్నాడు. న్యాయం కోసం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయగా, బద్వేల్ పోలీస్ స్టేషన్‌కు రెఫర్ చేశారని తెలిపాడు. అయినా కూడా తనకు న్యాయం జరగలేదని ఆరోపించాడు. అధికారులు తనకు న్యాయం జరిగేలా చూడాలని కోరాడు.

రెండు బైకులు ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన యువకుడిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారి డాబా హోటల్ వద్ద సోమవారం ఎదురెదురుగా రెండు బైకులు ఢీ కొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలివాండ్లపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ పల్సర్ బైక్‌పై రైల్వేకోడూరు నుంచి వస్తుండగా మంగంపేట గ్రామం నుంచి బైకుపై ఎం.బాబు కోడూరు వైపు వెళ్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరికీ కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఏపీఎండీసీ అంబులెన్సులో రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.మహేష్ నాయుడు తెలిపారు.

బ్రహ్మంగారి హుండీల ఆదాయం రూ .28.22 లక్షలు


బ్రహ్మంగారిమఠంలో కానుకలను లెక్కిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం : పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో భక్తులు సమర్పించుకున్న కానుకలను సోమవారం లెక్కించారు. రూ 28.22 లక్షలు నగదు, 3 గ్రాముల బంగారు నగలు, 990 గ్రాముల వెండి వచ్చినట్లు మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, దేవదాయశాఖ అధికారి భారతి, పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులు, ఆంధ్రాబ్యాంక్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.